సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 5 । అక్టోబర్ । 2024





మన్యం అందాలకు మంచు సొగసు తోడవడంతో ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. ఈ అపురూప దృశ్యాలు శుక్రవారం పాడేరు, మాడగడ హిల్స్ వద్ద కనువిందు చేశాయి. ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపారు.
- సాక్షి, పాడేరు





లడ్డూలో కాదు.. కూటమిలోనే కల్తీ..!

- **తిరుమల లడ్డూ వ్యవహారం సీబీఐకి అప్పగించడంపై సర్వత్రా హర్షం**
- **సుప్రీం నిర్ణయం చంద్రబాబుకు చెంపపెట్టు**
- **సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర సిట్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశం**
- **తప్పు జరిగితే దేవుడే చూసుకుంటాడంటున్న సామాన్యులు**
- **రాజకీయ లబ్ధి కోసం కూటమి నేతలు దేవుడిని వాడుకోవడంపై మండిపాటు**

సాక్షి, పాడేరు : పవిత్రమైన తిరుపతి లడ్డూను రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేసేశారు. వంద రోజుల పాలన వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు విషరాజకీయాలకు తెరతీశారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిపేశారంటూ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి. రెండు రోజుల తర్వాత.. కల్తీ నెయ్యి అనీ.. మరికొద్ది రోజుల తర్వాత.. లడ్డూలో కలవలేదనీ.. కలవకుండా ఆపేశామంటూ పూటకో మాట మార్చేస్తూ.. భక్తుల మనోభావాలతో రాజకీయ చదరంగమాడారు. దీనిపై నిష్పాక్షికమైన దర్యాప్తు జరిపించాలంటూ వైఎస్సార్‌సీపీ తరపున రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చంద్రబాబు, అండ్ కో చేసిన వ్యాఖ్యలపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి ఆధారాల్లేకుండా.. దేవుడిని రాజకీయాల్లోకి లాగారంటూ మండిపడింది. చేసిన తప్పుడు వ్యాఖ్యల్ని సమర్థించుకునేందుకు కూటమి ప్రభుత్వం.. రాష్ట్ర పోలీసులతో సిట్ పేరుతో ఆడాలనుకున్న నాటకాలకు ధర్మాసనం స్వస్తి పలికింది. లడ్డూ వ్యవహారం సీబీఐకి అప్పగించి.. స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కుటిల స్వార్థంతో భగవంతుడిని రాజకీయాల్లోకి లాగారంటూ ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. సుప్రీం నిర్ణయం చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని అభిప్రాయపడుతున్నారు. తప్పు జరిగితే దేవుడే చూసుకుంటాడనీ.. తప్పుడు ఆరోపణలు చేసినా.. ఏడుకొండల వాడు విడిచి పెట్టరంటున్నారు. మతజ్వాలలు రగిలించేలా ప్రభుత్వ తీరుపై అన్నివర్గాలు ఆగ్రహిస్తున్నారు. అసలు లడ్డూలో కల్తీ లేదని.. కూటమి ప్రభుత్వం చేసిన విషప్రచారంలోనే ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.



ఎన్డీఏ నుంచి చంద్రబాబును బహిష్కరించాలి

హిందూ ధర్మ పరిరక్షణే మూల సిద్ధాంతంగా పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం బీజేపీ మెజారిటీ హిందువుల ఓట్లతో మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. హిందువుల పార్టీగా చెప్పుకునే బీజేపీ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ... ఎలాంటి ఆధారం లేకుండా రాజకీయ దురుద్దేశంతో కోట్లాదిమంది హిందువుల మనోభావాలను కించపరిచేలా చంద్రబాబు తిరుపతి లడ్డూపై వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యక్తిని ఎన్డీఏ కూటమి నుంచి బహిష్కరించాలి.
– వాసు, జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్



రాజకీయ లబ్ధికోసమే తప్పుడు ప్రచారం

లడ్డూపై తప్పుడు విమర్శలు చేసిన కలియుగ ఆరాధ్యదైవం తిరుమల పవిత్రకు కూటమి ప్రభుత్వం భంగం కలిగించింది. ప్రపంచ వ్యాప్తంగా భక్తులంతా అత్యంత ఇష్టంగా స్వీకరించే దైవ లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేసిన పాపం ఊరకనే పోదు.లడ్డూ ప్రసాదంలోని నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగకపోయినప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయం కోసం తప్పుడు ప్రచారం చేశారు. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేయడంతో నైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి బుద్ధి రావాలి.
– డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకు ఎంపీ



రాజకీయం చేయొద్దు

కూటమి ప్రభుత్వం,ముఖ్యమంత్రి చంద్రబాబు వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై రాజకీయాలకు స్వస్తి చెప్పాలి. వంద రోజుల పాలనలో రాష్ట్ర ప్రజల సంక్షేమానికి చేసిందేమి లేదు. వరదలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. విజయవాడతో పాటు జిల్లాలోని గోదావరి, శబరి వరద బాధితులను ఆదుకోకుండా తిరుమల లడ్డు ప్రసాదంలో నెయ్యి కల్తీ అంటూ తప్పుడు ప్రచారాలతో కాలం గడపడం భావ్యం కాదు. ఇలాంటి వాటిని విస్మరించి ప్రజల సంక్షేమానికి పాటుపడాలన్న విషయాన్ని చంద్రబాబు గుర్తించాలి.
– పి.బాలదేవ్, జిల్లా కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం



లడ్డూలో కల్తీ అవాస్తవం

తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో ఎలాంటి కల్తీ లేదని భక్తులు విశ్వసిస్తున్నారు. నాసిరకం నెయ్యి వాడారని తప్పుడు ప్రచారంతో హిందువుల మనోభావాలను కూటమి ప్రభుత్వం దెబ్బతీసింది. దేవతామూర్తుల ప్రసాదాలను కూడా రాజకీయాల్లోకి లాగడం చాలా బాధకరమైన విషయం. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని రాజకీయాలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు విరమించాలి. దిగజారుడు రాజకీయాలు చేయడం తగదు.
– కిల్లు కోటిబాబునాయుడు, మోదమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, పాడేరు

ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా గుర్తింపు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల జారీ
- **గిరి రైతులకు** రుణాల రీషెడ్యూల్
- **కలెక్టర్ దినేష్**కుమార్

సాక్షి,పాడేరు: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో **జిల్లా ప్రజలు, రైతాం**గానికి ఏర్పడిన నష్టాలను దృష్టిలో **పెట్టుకుని జిల్లాను** ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా గుర్తిస్తూ **రాష్ట్ర ప్రభుత్వం ఉ**త్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ **ఏఎస్.దినేష్‌కుమార్** తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో **నిర్వహించిన జిల్లా** కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో **ఆయన మాట్లాడారు.** ఏడాది పాటు మారిటోరియం **ప్రకటించినందున** ఈమేరకు రైతులంతా రుణాలను రీషెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు సహకరించాలని, పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి కొత్త రుణాలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. విద్యా రుణాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బంగారంపై రుణాలు సక్రమంగా అందించలేని బ్యాంకులకు స్ట్రాంగ్ రూమ్‌లు నిర్మించాలని ఐటీడీఏ పీవోలను ఆదేశించారు. వరితో పాటు కాఫీ, ఇతర అంతరపంటలకు రెండు రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. వీటితోపాటు పాడి పశువులు, పందుల పెంపకం, చేపలబోట్లకు రుణాలతోపాటు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం పథకాలకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్‌పతి దీది పథకం రుణాలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌గౌడ్, ఎల్డీఎం మాతునాయుడు, యూబీఐ కన్వీనర్ హరిప్రసాద్, ఎస్బీఐ ఆర్ఎం అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్

సమస్యల పరిష్కార వేదికలో 177 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ్

పాడేరు : ప్రజల నుంచి స్వీకరించే వినతుల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మావతి ప్రజల నుంచి 177 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం పీజీఆర్ఎస్ వెబ్‌సైట్ పరిశీలించి వివిధ శాఖలకు వచ్చిన అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్, టీడబ్ల్యూ ఈఈలు డీవీఆర్ఎం రాజు, వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ కుమార్, డీఎల్‌పీవో కుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ప్రమాణాలు పాటించాలి

- వైద్యులకు కలెక్టర్ దినేష్‌కుమార్ సూచన
- ఎన్‌క్యూఎస్ ధ్రువపత్రాల పంపిణీ

పాడేరు : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు ప్రజల విశ్వాసం, నమ్మకాన్ని పొందేందుకు జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లాలోని 18 ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఎస్) సర్టిఫికెట్లను కలెక్టర్ దినేష్‌కుమార్ వైద్యులకు అందజేశారు.

జిల్లా పరిధిలోని అరకు, చింతపల్లి, కూనవరం ప్రాంతీయ ఆస్పత్రులకు, ఇందుకూరిపేట, తాజంగి, సప్పర్ల, పెదతమామిడి, జి.మాడుగుల, ఎల్లవరం, లాగరాయి పీహెచ్‌సీలకు, మునిరిపల్లి, గుత్తులపుట్టు, అడుగులపుట్టు, కొత్త పాడేరు, నెల్లుపూడి, చింతూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లకు గుర్తింపు పొందాయి. ఈ మేరకు సంబంధిత వైద్యాధికారులకు, కమ్యూనిటి హెల్త్ సిబ్బందికి కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, డీఆర్వో పద్మావతి, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా పాల్గొన్నారు.







కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న, తాజంగి, జి.మాడుగుల, లాగరాయి వైద్యాధికారులు భవాని, శశికాంత్, రవిచంద్రశేఖర్, నాగార్జున

• అబ్బురం.. సాంస్కృతిక సంబరం





ఏకలవ్య పాఠశాలల రాష్ట్రస్థాయి కల్చరల్ ఫెస్ట్ వేడుకలు అంబరాన్నంటాయి. యండపల్లివలస ఏకలవ్య పాఠశాల ఆవరణలో శుక్రవారం రెండో రోజు కూడా ఆదివాసీ సంప్రదాయాలకు అద్దంపట్టేలా ప్రదర్శనలు సాగాయి. కనుమరుగవుతున్న ఆదివాసీ కళలకు జీవం పోశాయి. ఈ సందర్భంగా గురుకులం జిల్లా కోఆర్డినేటర్ మూర్తి మాట్లాడుతూ అన్ని పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది సహకారంతో పండగ వాతావరణం సృష్టించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు చదువుతోపాటు గిరిజన సంస్కృతీ సంప్రదాయం, కళలపై అవగాహన కల్పించేందుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రత్నాకర్, చిన్నారి, భవాని, పాల్గొన్నారు. –అరకు రూరల్





క్లుప్తంగా

చాపరాయి జలవిహారిలో సందడి



జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయి జల విహారి వద్ద శుక్రవారం పర్యటకులతో సందడి నెలకొంది. దసరా సెలవులు కావడంతో అన్ని వర్గాల ప్రజలు తరలివస్తున్నారు. రోజంతా ఉత్సాహంగా గడుపుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శిగా వరప్రసాద్



విశాఖ విద్య: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శిగా శెట్టి వరప్రసాద్‌ను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. సమావేశంలో అనకాపల్లి జిల్లా, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మట్ట శ్రీనివాసరావు, యాసపోగు సుధాకర్ రావు, పాడేరు జిల్లా అధ్యక్షుడు జి చిన్నారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత రావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహదేవ్, జోసెఫ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరతతో వీధిన పడ్డ కార్మికులు

- ఉచిత ఇసుక ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుంది
- సీపీఎం కార్యదర్శి జగ్గునాయుడు హెచ్చరిక



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సీతమ్మధార: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరా పేరుతో కార్మికులను వీధిన పడేసిందని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని, ప్రజలు కొందామంటే ఇసుక దొరకడం లేదన్నారు. జిల్లాలో నిర్మాణాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని, 50 వేల మంది కార్మికులకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో టన్ను ఇసుక ధర రూ.1,070 ఉండేదని.. ప్రస్తుతం రూ.2300కి చేరడం దారుణమన్నారు. సిమెంట్ బస్తా రూ.370 ఉంటే ఇసుక బస్తా రూ.300–రూ350 ఉందన్నారు. ఆన్‌లైన్‌లో ప్రజలు బుకింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది కానీ.. ఈ బుకింగ్ రాజకీయ అధికార అండతో ఇసుక మాఫియాకు అడ్డాగా మారిందని మండపడ్డారు. రాత్రికి రాత్రి వీరు బుక్ చేస్తూ.. సాధారణ మధ్యతరగతి ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని భీమిలి ,అగనంపూడి డిపోల్లో ఇసుక లేదని.. రాజమండ్రి, శ్రీకాకుళం నుంచి కూడా ఇసుక రావడం లేదన్నారు. దీంతో నిర్మాణాలు ఆగిపోయి నిర్మాణరంగంపై ఆధారపడిన వారందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి ఆచరణకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని.. 100 రోజులు గడిచినా ఆ ఊసే లేదన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక ఇవ్వకుండా, సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయకుండా మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇసుకపై ఇచ్చిన మాటకు కట్టుబడకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.జగన్ అధ్యక్షత వహించగా.. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగారావు, కుమార్, ఈశ్వరమ్మ, నాయకులు రమణ, సుబ్బారావు పైడిరాజు, నరేంద్ర కుమార్, అప్పలరాజు , అనసూయ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవం శ్రేయస్కరం

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



గొడ్డలి దెబ్బతో బాధపడుతున్న మహిళకు చికిత్స అందిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా

డుంబ్రిగుడ: ఇంట్లో ప్రసవం వద్దని ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవం మంచిదని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా సూచించారు. శుక్రవారం ఆయన కిలోగుడ, డుంబ్రిగుడలోని 24 గంటల ఆరోగ్య కేంద్రలను తనిఖీ చేశారు. రోగుల వివరాలు, సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. ఓపీకి 90 మంది రోగులు రావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మలేరియా, టైఫాయిడ్ తగ్గుముఖం పట్టినప్పటికీ వాటికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి సూచించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు బీసీజీ టీకాను తప్పనిసరిగా వేయాలని సూచించారు. డుంబ్రిగుడ పీహెచ్‌సీలో బాలింతకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొదటి, రెండో కాన్పుకు ప్రభుత్వం అందించే సాయంపై విస్తత ప్రచారం చేయాలని సూచించారు. సిబ్బంది నివాసం ఉండేందుకు క్వార్టర్లకు సంబంధించి వైద్యాఆరోగ్య పిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపిచామన్నారు. గొడ్డలి దెబ్బకు తీవ్రంగా గాయపడిన గుంటగన్నేల పంచాయతీ జాముగుడకు చెందిన గిరిజన మహిళకు డీఎంహెచ్‌వో వైద్యం అందించారు. ఆరు పీహెచ్‌సీల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారుల బాధ్యతల స్వీకరణ



సీలేరు ఎఫ్‌ఆర్‌వో వెంకటరావు



రాజవొమ్మంగి ఎఫ్‌ఆర్‌వో ఉషారాణి



కూనవరం ఎఫ్‌ఆర్‌వో కరుణాకర్

సీలేరు: సీలేరు ఫారెస్టు రేంజ్ అధికారిగా సుంకరి వెంకటరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కె.డి.పేట రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన సిబ్బందితో సమావేశమై సీలేరు రేంజ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు సీలేరులో పనిచేసిన శ్రీనివాసరావును కెడి పేట రేంజ్ అధికారిగా బదిలీ చేశారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుమ్మిడి ఉషారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అడ్డతీగలలో లాగిన్ డివిజన్ రేంజర్‌గా పనిచేస్తు ఇక్కడకు బదిలీపై వచ్చారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఉషారాణి గతంలో చింతూరు డివిజన్‌లో కూడా పని చేశారు. ఇక్కడ ఎఫ్ఆర్‌ఓగా పనిచేసిన అబ్బాయిదొర చింతూరుకు బదిలీ అయ్యారు.

కూనవరం: స్థానిక రేంజ్ ఆఫీసర్‌గా ఎం.కరుణాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పోక్స్‌పేట రేంజ్ ఆఫీసర్‌గా పని చేస్తూ బదిలీ లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు కూనవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేసిన మోహిని విజయలక్ష్మి ఏలూరు డివిజన్ వన్యప్రాణి సంరక్షణ అధికారిగా (రేంజ్ ఆఫీసర్) బదిలీపై ఏలూరు డివిజన్‌కు వెళ్లారు. ఎఫ్ఆర్‌వో కరుణాకర్ మాట్లాడుతూ కూనవరం సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కె.వి.ఎస్.రాఘవరావు, చింతూరు డీఎఫ్‌వో ఆదేశాల మేరకు అటవీ రక్షణ, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న చింతపల్లి వైటీసీలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్, కేర్ ఫర్ యూ తదితర కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు 18 ఏళ్లు నిండి 30 ఏళ్ల లోపు ఉన్న ఇంటర్, డిప్లామో, డిగ్రీ, బీటెక్, ఆపై విద్యర్హత కలిగిన యువత అర్హులుగా తెలిపారు. కంపెనీ, పోస్టుకు సంబంధించి నెలకు రూ.10వేల నుంచి రూ.20వేల వేతనాలు ఇస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు 8985832827, 9398338105 నంబర్లకు లేదా httpr://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రోహిణి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్

చింతపల్లి: ఏజెన్సీ మారుమూల గ్రామాలతో పాటు ప్రతి గిరిజన రైతు సాగు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఫార్మర్ చాట్‌ను వినియోగించుకోవాలని డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్ పేర్కొన్నారు. చింతపల్లి మండలం చౌడుపాడు గ్రామంలో శుక్రవారం గిరిజన రైతులకు ఫార్మర్ చాట్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌పై పాడేరు, చింతపల్లి, అరకులోయ మండలాల్లో గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తు సూచనలు ఇస్తున్నామన్నారు. రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ



సదస్సులో మాట్లాడుతున్న వెంకటశేషమ్మ



హాజరైన అధికారులు, గిరిజన మహిళలు

అరకులోయ రూరల్: మహిళ న్యాయ విజ్ఞాన సదస్సులతోనే మరింత చైతన్యం కలుగుతుందని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి, ఎం వెంకటశేషమ్మ తెలిపారు. మండల కేంద్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చైతన్యం లేక చట్టాలన్నీ నిర్వీర్యమవుతున్నాయన్నారు. మహిళలందరూ చైతన్యవంతులుగా మారితేనే అన్ని రంగాల్లో రాణించేందుకు వీలు పడుతుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో హక్కులను పరిరక్షించుకునేందుకు గ్రామస్థాయి నుంచి విప్లవాత్మకంగా చైతన్యవంతులుగా ఎదగాలన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు నిర్మూలనకు అందరూ కృషి చేయాలని, అవగాహన లోపంతోనే చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసుకుని రక్తహీనత సమస్యతో పాటు ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయన్నారు. బాల్య వివాహాలు నిషేధ చట్టాం 2006 ప్రకారం ఆడవారికి-18, మగవారికి-21 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న వారికి వివాహం చేస్తే చట్టారీత్య నేరమన్నారు.ఇటువంటి సంఘటలకు సహకరించినా, వివాహాలు జరిపినా జైలు శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహాల వల్ల తల్లి, శిశువుకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అన్ని వర్గాల ప్రజలంతా గిరిజనులను చైతన్యవంతంగా మార్చేందుకు విప్లవాత్మకంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో జమాల్ బాషా, డ్వామా పీడీ శివయ్య, ఇన్‌చార్జి డీఈవో బ్రహ్మాజీరావు, సీడీపీవో శారధ, ఏవో ఉదయ్‌భాస్కర్, సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాల్ రావు, వివిద శాఖ అధికారులు,అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగెడ్డలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, సర్పంచ్ మాధవరావు

పెదబయలు: పెదబయలు మండలం సీతగుంట పంచాయతీ సీతగుంట గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డలో గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ రమణ తెలిపారు. గ్రామస్తులు శుక్రవారం మత్స్యగెడ్డ సమీపంలో వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లడంతో గెడ్డలో తేలియాడుతున్న మృతదేహం కనిపించడంతో రెవెన్యూ, సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ రమణ చెప్పారు. మృతుడు సుమారు 30 సంవత్సరాలలోపు వయస్సు ఉంటుందని, జీన్ ప్యాంట్, జర్కిన్ ధరించి ఉన్నట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశాన్నారు. ఎవరైన మిస్ అయితే పెదబయలు పోలీసు స్టేషన్‌కు సంప్రదించాలని కోరారు. సర్పంచ్ పలాసి మాధవరావు, వీఆర్వో ఆజాద్. సుందర్‌దేవ్ తదితరులున్నారు.

225 కిలోల గంజాయి స్వాధీనం

అదుపులో ముగ్గురు, ఐదుగురు పరారీ



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది

సీలేరు: గుంటవాడ జలాశయం వద్ద ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ ఆటలో తరలిస్తున్న 225 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలో బుల్దానా గ్రామానికి చెందిన వ్యక్తి 225 కేజీల గంజాయి తరలింపునకు జి.కె.వీధి మండలం చల్లని శిల్ప గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల సహాయంతో మల్కన్‌గిరి జిల్లా, కలిమెలా బ్లాక్ కప్పతొట్టి గ్రామంలో 10 బస్తాల గంజాయిని కొనుగోలు చేశారు. గంజాయిని ఎపి31టిజెడ్7482 నంబరు గల ఆటోలో తీసుకొస్తుండగా గుంటవాడ జలాశయం వద్ద నిర్వహించిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గంజాయి నిందితుల్లో ముగ్గురిని అదుపులో తీసుకున్నామని, ఐదుగురు పరారీలో ఉన్నట్టు చెప్పారు. పది బస్తాల గంజాయి 225 కిలోలు ఉందని, వీటి విలువ సుమారు రూ.11లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రవాణాకు ఉపయోగించిన ఆటోను, రూ'.1500 నగదును, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితులను విచారణ జరిపి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తామని, పరారీలో ఉన్న అయిదుగురు నిందితులను గాలింపు చర్యలను చేపడతామని సీలేరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అటవీ ఉత్పత్తులకు గిరాకీ



వారపుసంతకు తీసుకొస్తున్న అడ్డాకులు

డుంబ్రిగుడ: అరకు వారపు సంతకు శుక్రవారం గిరిజనులు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా అడ్డాకులు, కొండచీపుళ్లు, ముల్లంగి, క్యారెట్, చిలకడదుంపలకు గిరాకీ ధరలు పలుకుతున్నాయి. అడ్డాకుల మూట రూ.2000 కాగా కావిడి అడ్డాకులు రూ.4000 ధర పలికింది. కొండచీపుళ్లు బాగా అమ్ముడయ్యాయి. ఒక్కక్కటి రూ.50 నుంచి రూ.100 వరకు ధరలు పలికాయి. సంతకు తీసుకొచ్చిన ముల్లంగి, క్యారెట్, చిలకడదుంప వంటి వాటికి ధరలు పలుకుతుండడంతో గిరిజనులు లాభాలు పొందారు. చిలకడదుంపలు కావిడి రూ.1500ల వరకు అమ్ముడయ్యాయి. కావిడి ముల్లంగి రూ.500 నుంచి రూ.600, కావిడి క్యారెట్ రూ. 800 నుంచి రూ.1200 వరకు ధర పలికింది.

నేత్రపర్వంగా వెంకన్న ధ్వజారోహణం



ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేస్తున్న అర్చక స్వాములు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక శ్రీవేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నిత్య కార్యక్రమాలు నిర్వహించారు. విశేష ప్రసాద నివేదనలు పూర్తిచేసి భూదేవి, శ్రీదేవి సమేత కల్కి వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను, సుదర్శన పెరుమాళ్లను (చక్రత్తాళ్వార్) పెద్ద పల్లకిలో ఉంచి భేరీ పూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో అష్ట దిక్పాలకులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ గ్రామ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజ స్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేసి స్వామివారి బ్రహోత్సవాలకు భక్తజనంతో పాటు, అష్ట దిక్పాలకులు కూడా ఆహ్వానం పలికినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ



గాయత్రీదేవి అలంకరణలో అరకులోని భ్రమరాంబదేవి



గాయత్రీదేవి అలంకరణలో పాడేరులోని రాజరాజేశ్వరిదేవి

సాక్షి, పాడేరు :శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గాయత్రీ దేవి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మోదకొండమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఆలయంలో భవానీ మాలధారులు, ఇతర భక్తులకు ఉచిత ప్రసాదం, భోజన సమర్పణ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వహిస్తోంది.



విద్యుత్ వెలుగులో పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయం



మోదమ్మ ఆలయంలో భక్తులకు అన్న సమర్పణ